క్లుప్తంగా

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం

కేశంపేట: ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని కొత్తపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం ప్రథమ సంవత్సరం తెలుగు పేపర్1లో 5 మంది విద్యార్థులకు గాను 4 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని పరీక్షల కోఆర్డినేటర్ నారాయణ తెలిపారు.

పండగలు సంస్కృతికి ప్రతీకలు

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొత్తూరు: పండగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వలో సోమవారం నిర్వహించిన బొడ్రాయి వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. ఉరుకులు, పరుగుల జీవితంలో కొంతైన మనుష్యులకు ప్రశాంతత అవసరమన్నారు. అందుకే ప్రతి ఒక్కరు తమ తమ ఆచారాల ప్రకారం పండగలను జరుపుకోవాలని సూచించారు. దీంతో ప్రజల్లో స్నేహ సంబంధాలు బలపడుతాయని వివరించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన గ్రామ దేవతల ఆలయ నిర్మాణానికి ఆయన తనవంతుగా రూ.2 లక్షలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అజయ్ నాయక్, మిట్టునాయక్, రవికుమార్‌గుప్త, బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'హరి'తహారానికి గొడ్డలి వేటు

గ్రామ పంచాయతీ నాటిన చెట్లను తొలగించిన విద్యుత్ అధికారులు



గొడ్డలి వేటుకు నేలకు రాలిన చెట్లు

కేశంపేట: విద్యుత్ లైన్‌లకు అడ్డుగా ఉన్నాయనే సాకుతో విద్యుత్ లైన్‌మెన్ చెట్లను పూర్తిస్థాయిలో తొలగించారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ పాలక మండలి, ప్రజల సహకారంతో 8 విడుతలుగా నాటిన మొక్కలు రూపాంతరం చెంది చెట్లుగా మారాయి. సోమవారం విద్యుత్ లైన్‌మెన్ జంగయ్య విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్లను పూర్తిస్థాయిలో తొలగించారు. ఇదే విషయమై కేశంపేట విద్యుత్ లైన్‌మెన్ పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ను సంప్రదించగా కూలీలు తెలియక తొలగించారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో మొక్కలను సంరక్షిస్తే కొమ్మలను తొలగించకుండా చెట్లను తొలగించడం

రేపు మండల సర్వసభ్య సమావేశం

మండల అభివృద్ధి అధికారి సంధ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్ రూరల్: మండల సర్వసభ్య సమావేశం 14వ తేదీన బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సంధ్య తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. మొయినాబాద్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించి మూడు నెలల పూర్తికావస్తున్నందున్న మండల పరిషత్ అధ్యక్షురాలు నక్షత్రం జేవంతు అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి మొయినాబాద్ మండల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెక్ పవర్ కోసం వార్డు సభ్యుడి ఎంపిక



ఖాజాపాషను సన్మానిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండలంలోని నిర్దవెల్లిలో ఉప సర్పంచ్‌గా ఉన్న మల్లయ్యపైన వార్డు సభ్యులు ఇటీవల అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి నెగ్గారు. దీంతో ఉప సర్పంచ్ పదవీ ఖాళీ కావడంతో సోమవారం వార్డు సభ్యులు తమలో ఒక్కడైనా ఖాజాపాషను ఏకగ్రీవంగా రెండవ చెక్ పవర్ కోసం ఎంపిక చేసుకుంటూ తీర్మానం చేశారు. తీర్మానాన్ని జిల్లా పంచాయతీ అధికారికి పంపించి అక్కడి నుంచి ప్రొసీడింగ్ వచ్చిన తర్వాత ఖాజాపాషకు చెక్ పవర్ ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీఓ రవిచంద్ర కుమార్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్



షాద్‌నగర్‌రూరల్: 2కె రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



చేవెళ్ల: 2కె రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: దేశంలోనే తెలంగాణ పోలీస్‌శాఖ నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో 2కె రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏసీపీ కుశాల్కర్ ఆధ్వర్యంలో 2కె రన్ కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభించారు. 2కె రన్ మున్సిపల్ కార్యాలయం నుంచి ఇండోర్ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నక్సలైట్ల రాజ్యం వస్తుందని, శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని అప్పటి సీమాంధ్ర పాలకులు సాకులు చెప్పి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇవ్వకుండా కేంద్రాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ వేల కోట్ల రూపాయాలతో పోలీసు శాఖలో అనేక మార్పులను తీసుకువచ్చారు. పోలీసు లేని సమాజాన్ని ఊహించుకోలేమని, పోలీసులు లేకపోతే శాంతిభద్రతలు విచ్ఛిన్నమవుతాయని అన్నారు. శాంతిభద్రతలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్‌చైర్మన్ ఎంఎస్.నటరాజ్, జెడ్పీటీసీలు విశాల శ్రవణ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంఈఓ శంకర్‌రాథోడ్, సీఐలు నవీన్‌కుమార్, సత్యనారాయణ, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, దేవకి, విజయ్, నాయకులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

కొత్తూరు: వ్యాయామంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో సీఐ బాలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కే రన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే సైతం పోలీసులు, ప్రజా ప్రతినిధులు, యువకులతో కలిసి రెండు కిలోమీటర్లు నడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు నడక, వ్యాయామం, యోగాతో పాటు పలు క్రీడలను ఆడడం అలవాటు చేసుకోవాలన్నారు. వ్యాయామం చేసే అలవాటు ఉన్న వారు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వ్యాయామంతో శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అలాగే, ప్రజలు నిల్వ చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండి పండ్లు, తాజా కూరగాయాలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్, నాయకులు దేవేందర్‌యాదవ్, ఎమ్మె సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాజ్‌గోపాల్, జైపాల్, రాజేందర్‌గౌడ్, సీఐ బాలరాజు,ఎస్‌ఐ శంకర్ పాల్గొన్నారు.

రన్నింగ్‌లో ఆరోగ్యం మెరుగు

చేవెళ్ల: రన్నింగ్ చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలకేంద్రంలో సోమవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించారు. చేవెళ్ల పోలీస్‌స్టేషన్ నుంచి షాబాద్ చౌరస్తా వరకు 2కె రన్‌ను ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, ఏసీపీ ప్రభాకర్, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతిలతో కలిసి ప్రారంభించారు. 2కె రన్‌లో చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని అధికారులు, విద్యార్థులు, ఐకేపీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత దేశంలో ఎక్కడ ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతిపక్షపార్టీలు ఏమి చేశారో చెప్పుకోవడానికి కూడా వీలు లేదన్నారు. అందుకే ప్రజలకు ప్రభుత్వం చేసిన అభివృద్ధి దశాబ్ది ఉత్సవాల్లో కళ్లకు కట్టినట్లుగా వివరిస్తున్నామని చెప్పారు. అనంతరం పోలీస్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైలజ, మార్కెట్‌కమిటీ చైర్మన్ వెంకటరంగారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సీఐలు వెంకటేశ్వర్లు, గురువయ్యగౌడ్, ప్రసన్నకుమార్, లక్ష్మీరెడ్డి, ఎస్‌ఐలు హయ్యూమ్, ప్రదీప్, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నందిగామ: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని మేకగూడకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సైతం కార్పొరేటర్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నాడని అన్నారు. గ్రామానికి చెందిన రమేష్‌కు రూ.56 వేలు, కృష్ణయ్యకు రూ.42,500, ఎల్లయ్యకు 42,500, విజయకు రూ.24వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేష్, డీసీసీబీ డైరెక్టర్ మంజులరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పద్మారెడ్డి, ఎంపీటీసీ రాజునాయక్ పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి భూమిపూజ



భూమి పూజ నిర్వహిస్తున్న పాండురంగారెడ్డి, తదితరులు

నందిగామ: మండలంలోని మేకగూడలో నాట్కో ట్రస్టు ఆర్థిక సహకారంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి సోమవారం సర్పంచ్ రంగారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాట్కో పరిశ్రమ యాజమాన్యం 2016లో ఇచ్చిన హామీ ప్రకారం మేకగూడను దత్తత తీసుకుంది. అందులో భాగంగా నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చిందని వివరించారు. నాట్కో పరిశ్రమ ప్రతినిధి సాంబశివరావు మాట్లాడుతూ.. నాట్కో ట్రస్టు ద్వారా రూ. 30 లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మంజులరెడ్డి, నాట్కో ట్రస్టు ప్రతినిధులు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పద్మారెడ్డి, ఎంపీటీసీ రాజునాయక్, వార్డు సభ్యులు సుక్యానాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులకు బెల్టులు, ధ్రువపత్రాలను అందజేసిన జిల్లా అదనపు కలెక్టర్

షాద్‌నగర్: జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం షాద్‌నగర్‌లో విద్యార్థినులకు కరాటే బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ పోటీల్లో కొడిచర్ల తండాలకు చెందిన శిరీష, ధర్మాపూర్‌కు చెందిన కావలి నవీతలు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా ప్రతి కనబర్చిన విద్యార్థినులకు నిర్వాహకులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి తీసుకెళ్లి జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతి రావు చేతుల మీదుగా బెల్టులతో పాటుగా ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ స్కూల్స్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిన చెన్నయ్య పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి ప్రతీక రామ్‌రాజ్

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎండీ నాగరాజన్

షాద్‌నగర్: భారతీయ సంస్కృతికి ప్రతీక రామ్‌రాజ్ కాటన్ అని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, రామ్‌రాజ్ కాటన్ సంస్థ ఎండీ నాగరాజన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాటన్, లెనిన్ వస్త్రాలతో పాటుగా సకుటుంబ వస్త్రాలకు రామ్‌రాజ్ కాటన్ నిలయంగా మారిందన్నారు. ఎన్నో ఏళ్ళ నాటి ధోతీ కట్టు సంప్రదాయాన్ని తిరిగి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన కాటన్ వస్త్రాలను సరసమైన ధరలకు అందించడం హర్షనీయమని సంస్థ ఎండీ నాగరాజన్ అన్నారు. షాద్‌నగర్‌లో రామ్‌రాజ్ కాటన్ 251వ షోరూంను ప్రారంభించినట్లు తెలిపారు. 1983లో మొదటి రామ్‌రాజ్ కాటన్ దుస్తుల విక్రయాన్ని ప్రారంభించినట్లు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. దేశ స్వాతంత్రోద్యమ సమయంలో జాతిపిత మహాత్మా గాంధీ పంచకట్టే వారని, రాను రాను పంచకట్టును ప్రజలు మరిచిపోయారని అన్నారు. రామ్‌రాజ్ కాటన్ పంచకట్టును తిరిగి తీసుకురావడం జరిగిందని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తున్నామని, పంచకట్టుతో సమాజంలో గౌరవాన్ని పెంచే విధంగా చేసామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ రవీందర్‌యాదవ్, నరేందర్, నట్‌రాజన్, గణేష్, వెంకట్‌రాంరెడ్డి, విశాల, ప్రభాకర్, రమేష్, శ్రీవర్ధన్‌రెడ్డి, శంకర్, దండు వాసు, వెంకటేశ్వర్‌రెడ్డి, చీపిరి రవి యాదవ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• కరెంటు సమస్య పరిష్కారం ఎన్నడో?

మొయినాబాద్‌రూరల్: నదీమ్‌నగర్‌లో గత ఆరు నెలల నుంచి కరెంటు లేక అంధకారంలో భాయ భ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. గ్రామంలో దాదాపు వందకుపైగా కుటుంబాలు ఉన్నప్పటికి సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కరెంటు సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్తులు పేర్కొంటున్నారు. కాసింబౌలి పంచాయతీకి అనుబంధ గ్రామమైన నదీమ్‌నగర్‌లో గత మూడేళ్లకు పైగా ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను నిర్మించి ఈ దిమ్మెపై ట్రాన్స్‌ఫార్మర్ బుడ్డులను ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. దీంతో గ్రామంలో లోఓల్టేజీ సమస్య కారణంగా గాలిదుమారానికి కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

• కంటి వెలుగుతోతో ప్రయోజనం

సర్పంచ్ కేతన

షాబాద్: పేదలందరికీ ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పోసమోని కేతన రమేష్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరిగూడలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి అద్దాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు.

జీవాలకు చిటుక వ్యాధి టీకాలు తప్పనిసరి

షాబాద్: గొర్రెలకు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మరావుగూడలో జీవాలకు చిటుక వ్యాధి నివారణ టీకాల వేశారు. ఆయన మాట్లాడుతూ..జీవాల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

• విద్యార్థులను దాతలు ఆదుకోవాలి

తిర్మలాపూర్ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని తిర్మలాపూర్ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్ మండలంలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పేద విద్యార్థులకు కావలసిన అవసరాలను దాతలు ముందుకు వచ్చి వారికి సహాయం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేయాలన్నారు.

• ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

తహసీల్దార్ నయిమోద్దీన్

శంకర్‌పల్లి: గ్రామంలో ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాలోని పేర్లను సరిచేసుకోవాలని శంకర్‌పల్లి తహసీల్దార్ నయిమోద్దీన్ అన్నారు. సోమవారం రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి సర్వేలో భాగంగా ప్రతి బీఎల్ఓ ఓటరు జాబితాతో వెళ్లి ఓటర్లు పేర్లు సక్రమంగా ఉన్నాయా లేదా తప్పు ఒప్పులను గుర్తించాలని చెప్పారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయాలన్నారు. ఫొటోలు కూడా ఉన్నాయా లేదా చూసుకోవాలన్నారు. తప్పులు లేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు కృషి చేయాలన్నారు. పారదర్శకమైన ఓటరుజాబితాను సిద్ధం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియాంక, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

క్రీడలకు అదనపు స్థలం కేటాయించాలి



తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందిస్తున్న కమ్మెట గ్రామస్తులు, సర్పంచ్ తదితరులు

చేవెళ్ల: కమ్మెటలోని క్రీడాప్రాంగణం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆట స్థలానికి అదనపు స్థలంగా కేటాయించాలని కమ్మెట సర్పంచ్ తులసీరాజు, ఉప సర్పంచ్ కృష్ణగౌడ్‌లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు సర్పంచ్ తులసీరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో యువత ఆడుకునేందుకు ప్రభుత్వం క్రీడా ప్రాంగణం కేటాయించిందని దీనిని అభివృద్ధి చేసి ఆటలకు ఉపయోగిస్తున్నామని చెప్పారు. అయితే, క్రీడా ప్రాంగణం సరిపోవడం లేదని దీనికి అదనంగా మరికొంత స్థలం గ్రౌండ్‌కు కేటాయించాలని కోరుతున్నారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న క్రీడా ప్రాంగణం పక్కనే ప్రభుత్వ పీఓటీ కింద స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలం ఉందని అందులో నుంచి కొంత స్పోర్ట్స్ గ్రౌండ్‌కు కేటాయిస్తే యువతకు అన్ని రకాల క్రీడలకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో ఉప సర్పంచ్ కృష్ణాగౌడ్, గ్రామస్తులు మాధవ్‌గౌడ్, శశి, రాజు, దర్శన్, ముకుందం, మోనయ్య, గ్రామ పెద్దలు, యువకులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

షాద్‌నగర్‌రూరల్: బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బీజేవైఎం పట్టణ మాజీ అధ్యక్షుడు క్యామమహేష్, ఆయోధ్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు యువకులు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సీమాంధ్ర పాలకుల నుంచి రాష్ట్రాన్ని రక్షించుకునేందుకు సీఎం కేసీఆర్ మలిదశ ఉద్యమానికి నాంది పలికారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం అలుపెరగని పోరాటం చేశారని చెప్పారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని వివరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆరికర్షితులై స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో దేవేందర్, ప్రవీణ్, అభి, కృష్ణ, సత్యనారాయణ, యాది, శేఖర్, ప్రవీణ్, శ్రీనాథ్, ఓంకార్, నరేష్, రాఘవేందర్, రమేష్, శ్రీను, మల్లేష్ తదితరులు ఉన్నారు.

పల్లెప్రగతి దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఎంపీడీఓ వినయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న పల్లెప్రగతి దినోత్సవం విజయవంతం చేయాలని ఎంపీడీఓ వినయ్‌కుమార్ సూచించారు. సోమవారం పల్లెప్రగతి దినోత్సవం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ నెల 15న అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లెప్రగతి దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. అలాగే, గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ జెండాను ఎగుర వేయాలని చెప్పారు. పల్లె ప్రకృతివనం, క్రీడాప్రాంగణం, నర్సరీల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో ఏపీఎం నగేష్, ఎంపీడీఓ కార్యాలయం అధికారిణి శారద, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి



మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న రాఘవరెడ్డి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బాకారం సర్పంచ్ కొత్తపల్లి రాఘవరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం బడి గంట మోగింది. వివిధ పాఠశాలలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమైయ్యారు. బాకారం గ్రామంలో విద్యార్థులకు జిల్లా సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు. విద్యార్థుల అభివృద్ధికోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: స్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని అమ్డాపూర్ గ్రామస్తులు తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అమ్డాపూర్ రెవెన్యూలోని సర్వే నంబర్ 372లో 10 గుంటల ప్రభుత్వ భూమిని ముదిరాజ్ స్మశానవాటికకు గతంలోనే కేటాయించారని.. పక్క పొలంవారు ఆ స్థలాన్ని కబ్జాచేసేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఇటీవల స్మశానవాటికలో ఉన్న సమాధులను తొలగించారని.. స్థలాన్ని చదునుచేసి కడ్డీలు వేసే ప్రయత్నం చేశారని తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామని చెప్పారు. స్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. ఫిర్యాదు చేసినవారిలో ముదిరాజ్ సంఘం నాయకులు ఉన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

ఎంపీపీ రవీందర్ యాదవ్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని నాగులపల్లిలో బీరప్ప దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎంపీపీ రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అన్నారు. కురుమ యాదవులు గ్రామాల్లో పురాతన కాలం నుంచి బీరప్ప స్వామి పండుగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, భీష్మ రామకృష్ణ పాల్గొన్నారు.